

# నాన్న గది

ఆరోజు....

రామేశం ముగ్గురు కొడుకుల్నీ, కోడళ్ళనీ సమావేశపర్చాడు...

ఆయనేం చెప్పబోతున్నాడో వాళ్ళకీ తెలుసు... విడిపోవటం వాళ్ళకి కూడా ఇష్టం లేదు. అయినప్పటికీ ఆయన మాట కాదనలేక అంతా కూచున్నారు. రామేశం

చెప్పటం మొదలెట్టాడు.

"చూడండ్రా... ఏ తల్లీ, తండ్రయినా తమ కళ్లముందు పిల్లలు విడిపోవాలని కోరుకోరు. ఎందుకో తెల్సా... పిల్లల వేర్పాటుతనం అనేది వృద్ధాప్యంలో దాన్ని మించి బాధించే సమస్య. ముఖ్యంగా... ఈ ఇల్లు నేనూ, మీ అమ్మ చాలా కష్టపడి కట్టుకున్నాం. అదృష్టవంతురాలు... తాను ముందే పోయింది. ఈ ఇల్లు కట్టేటప్పుడు తన పుస్తెల తాడు అమ్మాల్సివచ్చిన్రోజు... నేను పడ్డ సంఘర్షణ అంతా ఇంతా కాదు. ముప్పయ్‌వేలు అప్పు చేసి అది తీర్చడం కోసం నేను ఓవర్‌టైంలు చేసాను. మీ అమ్మ బీడీలు చేయటం మిషన్ కుట్టటం నేర్చుకొని పదివేలు కూడబెట్టింది. బీడీల్లో చుట్టే తంబాకు వాసనకి తన ఆరోగ్యం పూర్తిగా పాడయినా... ఓవర్‌టైంలతో నేను అలసిపోయి వచ్చినా... ఈ ఇల్లుని చూడగానే అంతా మర్చిపోయేవాళ్లం... మీరు పెద్దవాళ్లయ్యారు. ఎవరికి వారు వేరుందాం అనే ఆలోచనలు మీలో వుండొచ్చు. మీరు వేరుండటమే కాదు. ఈ ఇంట్లో పంపకాల పేరుతో అడ్డుగోడలు మొలవటం నేను భరించలేను. దయచేసి నేను చనిపోయేంత వరకు ఈ ఇంటిని ఇలాగే వుంచండి..."

రామేశం చేతులెత్తి మొక్కితే... కొడుకులూ, కోడళ్ళు కరిగిపోయారు. ఆయన కళ్లల్లో సన్నటి నీటిపొరను చూసి తట్టుకోలేని అయిదుగురు మనవలూ, మనవరాల్లూ చలించిపోయి 'తాతయ్య'ని ఆప్యాయంగా చుట్టేసారు. "లేదు నాన్నా... మేమెప్పుడూ విడిపోము... అలాగే ఈ ఇంటిని అపురూపంగా చూసుకుంటాం... మీరేమీ బెంగ పెట్టుకోవద్దు" అన్నారు కలిసికట్టుగా.

"అవును మామయ్యా... తోడికోడళ్లమైనా అక్కాచెల్లెళ్ల త ప్రేమాభిమానాలున్నాయి మామద్య. అందుకని మేం విడిపోయే ప్రసక్తే లేదు. అలాగే

ఈ ఇంట్లో మసిపట్టినా మా కొంగుతో తుడుస్తాం తప్ప... మేం విడిపోయి ఏ అడ్డుగోడ మొలవనివ్వం" అన్నారు కోడళ్లు.

రామేశం కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వాళ్ల ఆత్మీయతకి.

"నాక్కావల్సిందీ అదేరా... నా కొడుకులూ, కోడళ్లు లక్ష్మయ్య పిల్లలకన్నా, నర్సిరెడ్డి పిల్లలకన్నా చాలా ఉత్తములు... గొప్పవాళ్ళు... నాకు చాలా ఆనందంగా వుందిరా...

"జీవితానికి ఇది చాలు..." అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు.

అప్పుడే ఆ ఇంటిముందు రిక్షా ఆగింది....

రిక్షాలోని వస్తువుని చూసి పిల్లలు కేరింతలు కొట్టారు. ఆడవాళ్ల మొహాలు ఆనందంగా విప్పారాయి.

అది కలర్ టీవీ...

బ్లాక్‌అండ్ వైట్ టీవి దరిద్రం వదిలినందుకు అందరిలోనూ ఉత్సాహం, రిక్షా వాడితో పాటు కేబుల్ బాయ్ వచ్చాడు.

టీవీని ఓ మూలన టేబుల్ మీద పెట్టి కేబుల్ కనెక్షన్ ఇచ్చాడు.. టీవీ ఆన్ చేసేముందు... 'ఆగండి....ఆగండి' అంటూ చిన్న కోడలు వచ్చి ఆదుర్దాగా దాని ముందు కొబ్బరికాయ కొట్టి... టీవీ పై నీళ్లు చిలకరించింది.

టీవీ ఆన్ చేయగానే... చిరంజీవి సిన్మా కనపడటంతో పిల్లలు హే... అంటూ కేరింతలు కొట్టారు.

పదకొండు మంది గదిలో కూచుండే సరికి... చాలా ఇరుకైపోయింది. స్క్రీన్‌కి ఎవరి తల అడ్డొచ్చినా ఏదో కామెంట్...

ఆ ఇరుకుని భరించలేకపోయారు... ఆగది పక్కనే స్టోర్ రూం వుంది. స్టోర్ రూం ఖాళీ చేసి ఆ గదికీ, స్టోర్ రూంకి మధ్య గల అడ్డుగోడని తీసేస్తే టీవీ రూం విశాలంగా అవుతుంది అన్న ఆలోచన అందరికీ కలిగింది ఆసమయంలో...

దాన్ని వెంటనే అమలులో పెట్టారు.

గునపం పోటు శబ్దం విన్న రామేశం గుండెల్లో ఏదో దిగినంత బాధగా మంచంలోనే ఉలిక్కి పడి ఆదుర్దాగా లేచొచ్చాడు.

అప్పటికే గోడ కూలిపోయింది...

"ఇదెందుకు కూలదోసా్రా..." ఆయాసంతో పాటు ఆవేదనగా అడిగారు. చిన్నకొడుకు చెప్పాడు.

"అందరం కల్సి ఈ గదిలో టీవీ చూడటం చాలా ఇబ్బందిగా, ఇరుగ్గా వుంది నాన్నా... ఈ గోడ తీసేస్తే అందరం హాయిగా టీవీ చూడొచ్చు" అన్నాడు దానికి పెద్దకోడలు సపోర్ట్ చేస్తూ...

"ఈ టీవీ రూంలోనే సోఫాసెట్ కూడా వేస్తే వచ్చిపోయేవాళ్లకు కూడా బావుంటుంది మావయ్యా... ఎలాగూ స్టోర్ రూం వాడట్లేదు కదా" అంది.

"ఆ గదిలో మీ అమ్మ బాపతు పందిరి మంచం, నీళ్లు పోసుకునే గంగాళం, తమలపాకుల బుట్ట, కొప్పెర, చెక్క ఊయల వుండె కదరా..." అన్నాడు. ఆ మాటకి రెండో కొడుకు నవ్వాడు.

"అదేంటి నాన్నా... ఈ కాలంలో కూడా ఆ పాత వస్తువుల గురించి పట్టింపేంటి? అవన్నీ పాత సామాన్లోడికి పడేసాం కాని... నువ్వు నీ గదిలో కెళ్లి పడుకో..." అన్నాడు.

"అది కాదురా... ఈ గోడ కూలగొట్టకపోతే బావుండేదేమో..." అన్నాడు దీనంగా.

"మరి టీవీ ఎలా చూస్తాం తాతయ్యా....?" అన్నాడో మనవడు చిరాగ్గా.

రామేశం కూలిపోయిన గోడవైపు బాధగా చూసాడు. తనకింకా గుర్తు.. ఆ గోడ పెట్టేటప్పుడు ఇటుకలు బాగా పేర్చవయ్యా... తీర్చిదిద్దినట్టుండాలి..." అంటు తన భార్య సుతారి (మేస్త్రీ) కి నాలుగుసార్లు ఛాయ్ పెట్టిచ్చింది.

'అది నానమ్మ గదిరా' అని గొణుక్కుంటూ రామేశం తన గదిలోకి వెళ్లిపోయాడు.

మనసు కుంగిపోయింది...

ఆరోజు నించి ఏ ఒక్క మనవడూ తన మంచంపై కూచోలేదు. బలవంతంగా తను పిలిచినా టీవీలో వచ్చే 'యాడ్'ని బట్టే... ఫలానా సినిమా వస్తోంది తాతయ్యా' అంటూ పరిగెత్తే వాళ్లు...

అన్నం పెట్టి... తినేవరకూ తన ముందు కూచుండే కోడళ్లు పళ్లెం, నీళ్ల పెట్టి జారుకుంటున్నారు. క్రికెట్ వచ్చిన్రోజు కొడుకులు తన గదివైపే రారు...

మనుషుల మధ్య మాటలే కరువయ్యాయి... దానివల్ల!!

ఆరోజు నించీ 'టీవీ'ని చూస్తే రామేశానికి అసహ్యమేసేది. భయమేసేది

కూడా!!

తన ఇంటి గోడల్ని కూల్చేయటమే కాదు. తన భార్య వస్తువుల్ని కూడా దూరం చేసిందది!!

ఇంతలో... బావిలో ధబిల్లుమన్న శబ్దం విన్పించి... అంతా కంగారుగా పరిగెట్టారు. కానీ ఎవరికీ ఏం కాలేదు. బావిలో నీళ్లు తోడుతున్న చిన్న కోడలు చేతిలోంచి 'బొక్కెన' జారిపోయి బావిలో పడింది.

అందర్ని చూసి ఆమెకేడ్పు ఆగలేదు... ఎర్రగా కందిన చేతుల్ని భర్తకి చూపిస్తూ "ఈ నీళ్లు తోడటం నావల్ల కాదు. ఈ ఇంట్లో వున్నంత కాలం ఈ నీళ్లు తోడే వంతు నాకు తప్పదు. నేను పుట్టింటికెళ్లిపోతాను. లేదా మనం వేరుగా వుందాం" అంటూ ఏడుస్తూ ఇంట్లోకి పరిగెత్తింది.

అందరి మనసుల్లోనూ ఏదో దిగులు...

ఎక్కడి వాళ్లక్కడ మౌనంగా వెళ్లిపోయారు...

రామేశానికి బాధతో పాటు.. ఈ నెపంతో వీళ్లు విడిపోతారా అనే విచారం పొంగుకొచ్చింది.

కాని ఆరోజు సాయంత్రానికల్లా... టూ-హెచ్.పి.మోటార్ తీసికొచ్చారు. బావిలోకి పైపులు దించారు. ఇక నీళ్లు తోడే బాధ పూర్తిగా తప్పినందుకు కోడళ్ల మొహాల్లో చెప్పరాని సంతోషం.

బావి దగ్గర మోటార్‌ని అమర్చడానికి ఏ ఆసరా లేదు. నీడ కూడా లేక పోవడంతో వర్షం పడితే దాంట్లోకి నీళ్లుపోయి చెడిపోతుందని.. దాన్ని రామేశం గది ప్రక్కనే గల గద్దెపై అమర్చారు.

"ఇక్కడ వద్దురా... ఆ గద్దెపై వద్దు" అన్నాడు రామేశం. కొడుకులు ఏమీ మాట్లాడలేదు. మోటార్ తెచ్చిన మెకానిక్ మాత్రం "మరి ఈ మోటార్ ఇక్కడ తప్ప ఇంకెక్కడా పెట్టరాదండీ. చెడిపోయిందంటే పదివేలు నష్టం. నేను మళ్లీ రమ్మంటే రాను. మీ ఇష్టం" అన్నాడు.

పెద్దకొడుకు కొంచెం చిరాగ్గా... "ఆ గద్దెనేమీ చేయట్లేదుగా... మోటార్ పెడుతున్నామంతే... ఏమయ్యా మెకానికూ... ఆయనలాగే అంటారు కాని నువ్వు ఫిట్ చెయ్యి' అన్నాడు.

అంతే! గంటలో ఆకుపచ్చరంగులో వున్న ఆ యంత్రం బిగించబడింది. అది స్టార్టయి బావిదగ్గర నీళ్లు పోయగానే... వర్షంలో తడిసినంత ఆనందంగా ఇంటిల్లిపాదీ ఎగిరి గంతేసారు.

ఒకప్పుడు రోజూ సాయంత్రం తన రాక కోసం ఎదిరిచూస్తూ తన భార్య ఆ గద్దెపైనే కూచుండేది. అందుకే ఆ గద్దె అంటే ఇష్టం...

దాని మీద తిష్టవేసిన ఆ యంత్రం... నీళ్లకోసం అది స్టార్ట్ అయినప్పుడల్లా ఆ శబ్దానికి... తన గుండె గిర్నిలో పిండి చేస్తున్నంతగా నలిగిపోయేది. మంచినిద్రలో వున్నప్పుడో... తెల్లవారుజామునో వాళ్లు మోటార్ వేసేవాళ్లు... ఆ శబ్దం రెండు గంటలు చిరాకు పుట్టిస్తూ... కలవర పరుస్తుంది.

తన భార్య ఆలోచనల్లో మునిగిపోయినప్పుడు తేనేటీ గల దండు దాడి చేస్తున్నట్టు దాని శబ్దం... కల్లోల పరుస్తోంది. ఆ మోటారు బిల్లు కట్టుకోవటంలో వీళ్ల మధ్య ఏమైనా తారతమ్యాలోస్తాయేమోనని కొంత బెంగ కూడా మనసు మూలల్లో బిక్కు బిక్కు మంటోంది.

ఆ సమయంలోనే... చాకలి రాజమ్మ "బట్టలు ఎక్కువ పడుతున్నాయ్. ఉతకడం నావల్లకాదు. ఇంకో యాభై రూపాయలు జీతం పెంచండి" అని హుకుం జారీ చేసింది. పదిహేనేళ్ల నించీ ఈ ఇంట్లో ఉతుకుతున్న మనిషి. సర్దిచెపితే అది ఊరుకునేది.. కాని రెండవ కోడలు దాని మాటని రాద్ధాంతం చేసింది.

దాదాపు గొడవ పెట్టుకుంది...

రేపట్నించీ పని మానెయ్యమంది...

ఆ గొడవంతా చూస్తోన్న రామేశం ఏడుస్తోన్న చాకలి రాజమ్మని "ఊరుకోవే... వాళ్లకి తెలీదు.'' అని ఓదారుస్తూనే... రెండో కోడలితో "చూడమ్మా రజితా... చాకలమ్మ అంటే ఇంటి ఆడబిడ్డ అంటారు. దీపావళి రోజు రాజమ్మ పొద్దుటే మంగళహారతి కూడా తెచ్చి కట్నం అడుక్కుంటుంది. పదిహేనేళ్ల నించి ఈ ఇంట్లో అణువణువూ దానికి తెలుసు. పది రూపాయలు పెంచితేనే పండగొచ్చినట్టు సంబరపడుతుంది. మీ అత్తమ్మ దాన్ని అంత గౌరవంగా చూసుకునేది కూడా" అన్నాడు. నిదానంగా.

అయినా కోడలు వూర్కోలేదు..

"ఏంటి మావయ్యా... చాకల్దాన్ని వెనకేసుకొస్తున్నారు. ఆవిడ రాకపోతే తెల్లారదా... ఏయ్ రాజమ్మా... నువ్వు రేపట్నించీ పనిలోకి రాకు..." అంది సీరియస్‌గా.

ఆ మాటకి రాజమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

కొంగుతో కళ్లొత్తుకుంటూ.... "రానమ్మా... శాంతవ్వ బతికున్నప్పుడన్నా నన్నొక్క మాట అన్లేదు... ఈ ఇంటికి రానమ్మా... అంటూ వెళ్లిపోయింది.

రామేశం నిశ్చేష్టుడై వుండిపోయాడు.

అంతలో పెద్దకోడలు అక్కడికొచ్చి "ఎందుకే రజితా... అంత సీరియస్సయ్యావ్" అంది బాగా నొచ్చుకుంటూ.

"పోనీలే అక్కా... అది పని మానేసినంత మాత్రాన మనకి ఇబ్బందనుకుంటుందేమో... మొన్న మనింటికి మా ఫ్రెండ్ వచ్చింది కదూ... అది ఏమే... మీ ఇంట్లో వాషింగ్ మెషిన్ కూడా లేదా అంది. నిజంగా నాకు తలకొట్టేసినట్లయిందక్కా..... ఈవిడ గారు పనిమానేస్తే తప్ప మనింట్లోకి వాషింగ్ మెషిన్ నడిచొచ్చేలా లేదు..." అంది.

వాషింగ్ మెషిన్ పేరు వినగానే పెద్ద కోడలు కళ్లు ఇంతయ్యాయి.

"అవునే... అది ఎంత బావుంటుందో... మా చెల్లెలింట్లో కరీంనగర్లో చూసాను. చాలా బావుంటుంది కదా" అంది రాజమ్మ విషయం మర్చిపోయి.

"రేపు ఆయన వాషింగ్ మెషిన్ తెస్తానన్నారక్కా..." అంది ఆనందంగా...

తర్వాత వాళ్లు ముచ్చట్లలో పడ్డారు...

ఇంట్లోకి మరో యంత్రం వస్తూ... ఒక ఆత్మీయురాలిని దూరం చేసిందన్న బాధతో రామేశం తన గదిలోకి వెళ్లిపోయాడు.

చాకలి రాజమ్మ బట్టలకోసం వచ్చిన ప్రతిసారీ వూర్లో విషయాలన్నీ తనకి చెప్పేది. నడిచే ఓపిక లేని తనకు ఏదైన సమాచారం వెళ్లాలన్నా, రావాలన్నా రాజమ్మే పనికొచ్చేది.

రాజమ్మ పొట్టకొట్టిన ఆ యంత్రం పేరు తల్చుకోవడానికైనా రామేశం

మనసొప్పలేదు... మంచంలో పడుకున్నాక ఆలోచనల్తో చిత్తడిగా మారిన మనసుకు... గది పక్క మోటార్ శబ్దం రంపపు కోత కోస్తోంది.

మర్నాడు...

చిన్నకొడుకు తన గదిలోకొచ్చి వినయంగా నిల్చున్నాడు.

"ఏంటి కన్నా..." అన్నాడు ఆప్యాయంగా.

"ఏం లేదు నాన్నా... నా బెడ్‌రూంలో కూలర్ ఆన్‌చేస్తే, దానికి గాలి తగలక శరీరాలన్నీ జిడ్డుజిడ్డుగా అవుతున్నాయి. అందుకని బెడ్‌రూం కిటికీ కూలగొట్టేసి కూలర్ ఫిట్ చేయాలనుకుంటున్నాం. ఆ గదిలో వున్న తీగమల్లె బాగా గుబురుగా పాకిపోయింది. అది కూలర్‌కి అడ్డం వస్తోంది. దాన్ని కూడా పీకేసి..." అని నసిగాడు.

రామేశానికి కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

"ఒరేయ్... ఆ తీగమల్లె తొమ్మిదేళ్లుగా వుంటోందిరా... మూడేళ్లకింద మీ అమ్మ చచ్చిపోయే ముందు రోజు కూడా ఆ మల్లె చెట్టుకి నీళ్లు పోసింది. నీ బెడ్‌రూం కిటికీలోంచి ఆ మల్లెలు గాలికి వూగుతూ... పరిమళాలు పంచేవిరా... దాన్ని పీకేయటం... కిటికీని కూలర్‌తో మూసేయటం అవసరమంటావా?" అన్నాడు. కాని అప్పటికే పెద్దవాడి కొడుకు పరిగెత్తుకొచ్చి...

"బాబాయ్... ఇక్కడున్నావా... పనివాళ్లు మల్లెచెట్టు మొత్తం తీసేసారు... కిటికీ కూడా కూలగొట్టారు. కూలర్ ఫిట్ చేస్తున్నారు. నిన్ను రమ్మంటున్నారు." అన్నాడు ఎగపోస్తూ...

ఆ మాట విని రామేశం మనసు కలుక్కుమంది...

కొడుకు తండ్రి మొహంలోకి చూడలేక మెల్లగా జారుకున్నాడు...

ఇంట్లో కొడుకులు యంత్రాల రూపంలోకి మారిపోతుండటం బాధేసింది. రేపు మరే యంత్రం వస్తుందో అనుకున్నాడు.

కాని... అది వాస్తురూపంలో వచ్చింది...

చిన్న కోడలికి మళ్ళీ అబార్షన్ కావటంతో... డాక్టర్లకి బదులు ఈసారి ఓ వాస్తు పండితుణ్ణి ఇంటికి పట్టుకొచ్చారు కొడుకులు.

అతడొచ్చి ఈశాన్యం, వాయువ్యం అంటూ... అబార్షన్లు అవడానికి కారణం ఈ వంటిల్లని దాన్ని కూల్చి నైరుతి దిక్కు కట్టుకోవాలని చెప్పాడు.

ఆ మాట విని రామేశం గుండె కలుక్కుమంది.

నిల్చొని వంట చేసేలా... తన భార్య తన ఇష్టపూర్వకంగా కట్టించుకుంది. కట్టాకే చిన్నోడు పుట్టాడు. అప్పుడు తనకే అబార్షనూ కాలేదు. అని మథన పడుతుండగానే... అమెరికా ట్రేడ్ సెంటర్లని ఆఫ్ఘాన్ హైజాకర్లు విమానాల్తో కూలదోసినంత బలంగా... ఫెళ ఫెళార్భాటాలతో వంటగది కూలిపోయింది.

రామేశం గుండె గదులు బీటలు వారాయి.

ఆ దృశ్యం చూడలేక గబగబా గదిలోకెళ్ళి పోయాడు. వంటగదిలో శిథిలాల కింద భార్య రూపం నలిగిపోతున్నట్టు తెరలు తెరలుగా కన్పడుతోంది.

ఒళ్లంత చెమటలు పట్టాయి...

నరాలు కంపిస్తున్నాయి.

కళ్లల్లో ఏదో బెరుకు...

తలుపు దగ్గర అలికిడైతే వెనుదిరిగి చూసాడు... పెద్దవాడు, రెండోవాడు ఏదో పనిమీద గదిలో కొచ్చారు.

వాళ్లని చూడగానే రామేశం నిలువెల్లా వణికిపోయాడు...

"ఏమైంది నాన్నా..." కంగారుగా అడిగారిద్దరూ...

గొంతులో సుళ్లు తిరిగే బాధతో కంఠం జీరబోతుంటే... వణుకుతూనే ప్రాథేయపూర్వకంగా చెప్పాడు.

"ఈ ఇల్లంతా నా కలల పంటరా.... అయినా దీన్ని మొత్తం మీరు కూల్చేసినా పర్లేదు... కాని నా గదిని మాత్రం ఏం చేయొద్దురా... మీకు దండం పెడతాను... ఈ గదిలో మేకు దిగినా నా గుండెల్లో బాకు దిగినట్టుగా వుంటుంది. ఈ గది నిండా మీ అమ్మ జ్ఞాపకాలున్నాయిరా... ఈ గదినిండా మీ బాల్యం వుందిరా... ఇది నాకోసం కట్టించుకున్నాను... అదిగో... ఆ కిటికీలోంచి చూస్తే రోడ్డు కన్పిస్తుంది. వచ్చిపోయే వాళ్ళు కన్పిస్తారు.... నా గదిని మాత్రం ఏం చేయకండిరా..." కడుదీనంగా... ప్రార్థిస్తున్నట్టుగా... అర్థిస్తున్నట్టుగా అడిగాడు.

"లేదు నాన్నా... నీ గదిలో ఈగ కూడా వాలదు... నువ్వు కంగారు పడకు" అని హామి ఇచ్చి వెళ్ళిపోయారిద్దరూ...

కాని... ఆ సాయంత్రమే... వాళ్లకి నోటీసులొచ్చాయి...

అవి చదివి నిశ్చేష్టులయ్యారు.

నాన్న నెలా బతికించుకోవాలా అని తర్జనభర్జన పడ్డారు...చివరికి 'నాన్న

బతకాలి' అని ధృఢంగా అనుకున్నారు.

అందుకే తండ్రిని బుజ్జగించి... బ్రతిమాలి... ఇంటి వెనక వున్న మరోగదిలోకి మార్చారు.

కాని మర్నాడే...

రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా వచ్చిన బుల్‌డోజర్ రామేశం గదిని కుప్ప కూలుస్తుంటే... భోరున ఏడ్చారు... కొడుకులు... కోడళ్లు...

ఆ శబ్దాన్ని గుర్తించిన రామేశం గుండె...

ఆ...గి...పో...లే...దు... !!!

మరుసటి రోజున...

కొడుకులూ, కోడళ్లు అంతా ఓ నిర్ణయానికొచ్చారు

"రోడ్డు నట్టింట్లోకి వచ్చేస్తోందంటే... మనం ప్రమాదాల అంచున బతకాల్సిందే... అందుకే ఇంటిని 'షాపింగ్ కాంప్లెక్స్‌గా' మార్చేద్దాం. ఈ ఇల్లు విడిచిపెట్టి... ఎవరికి వారుగా సెటిలవటం మంచిది..."

అందరిలోనూ కొందత దిగులు... కానీ తప్పదు.

చెప్పలేక... చెప్పలేక తప్పని స్థితిలో తండ్రి చెవిన వేసారు. కాని అప్పటికే విషయం అర్థమై....

రామేశం గుండె... ఆ...గి...పో...యి...ం...ది !!!

❋ ❋ ❋